హైదరాబాద్ వార్త



# అనాథ రోగులకు వైద్యమేది?

**ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లో తోడు లేకుండా వచ్చే వారికి నరకమే ■ ఓపీ చిట్టీ ఉంటెనే వైద్యం.. పట్టించుకోని వైద్య సిబ్బంది**



హైదరాబాద్, జనవరి 18, ప్రభాతవార్త : ఏ తోడూ లేకుండా ఉస్మానియా, గాంధీ ఆస్పత్రికి వస్తే నరకమే. ఇక్కడ ఔట్‌పేషెంట్ల విభాగంలో ఓపీ చిట్టి రాయించుకున్నవారే రోగులు...బెడ్ మీద పడుకున్న వారికే చికిత్స అన్న తీరుగా వైద్య సిబ్బందిగా వ్యవహరిస్తున్నారు. దిక్కు మొక్కు లేని అనాథలకు ఇక్కడ వైద్యం దొరకడం గగనమే. ఎక్కడి నుంచో వచ్చి ఆస్పత్రి ఆవరణలో చడీచప్పుడు లేకుండా ఆస్పత్రి ఆవరణలో పడిపోయే అభాగ్యులు ఎందరో ఉన్నారు. వైద్యం అందక ప్రాణాలతో కొట్టుమిట్టాడుతూ దిక్కులేకుండా పడి ఉన్న అనాథలు ఆస్పత్రి ఆవరణలో కన్పిస్తుంటారు. గుర్తు తెలియని కొందరు వృద్ధులు, యువకులు ఆస్పత్రికి వస్తే వారికి వైద్యం సరిగా అందటం లేదు. వారి వెంట అడిగే వారు ఎవరూ లేకపోవటంతో అభాగ్యులకు వైద్యం దొరకడం కష్టంగా మారింది. మతిస్థిమితం లేకనో, ఆరోగ్యం బాగలేకనో, వృద్ధులో ఇలా గుర్తుతెలియని ఒంటరి వారు ఎక్కడి నుంచో వచ్చి నగర రోడ్లపై సొమ్మసిల్లుతుంటారు. ఇలాంటి వారిని చూసి మానవత్వం ఉన్న కొందరు వ్యక్తులు 108 వాహనానికి ఫోన్ ద్వారా సమాచారం ఇస్తుంటారు. అభాగ్యుల ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా 108 సిబ్బంది వారిని నేరుగా ప్రభుత్వ ఆస్పత్రులైనా ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులకు తరలిస్తుంటారు. అక్కడ వదిలేసిన రోగులకు ఆస్పత్రి సిబ్బంది మొక్కుబడి వైద్యాన్ని అందిస్తున్నట్లు తెలుస్తోంది. అడిగే వారు ఎవ్వరూ లేరనే ధీమాగా వారు వ్యవహరిస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు.

నిజానికి ఆరోగ్యం బాగ లేక నడవలేని పరిస్థితిలో ఉన్న రోగి ప్రభుత్వ ఆస్పత్రిలో కనిపిస్తే వెంటనే స్ట్రెచర్ కానీ వీల్‌చైర్ కానీ తీసుకొచ్చి సిబ్బంది వారిని మెరుగైనా వైద్యానికి తరలించాలి. ఇలాంటి దాఖలాలు ప్రభుత్వ ఆస్పత్రిలో కనిపించవు. తమకు ఏం పట్టనట్టుగా మనకు ఎందుకులే? అన్నట్టుగా ఆస్పత్రి అధికారులు, సిబ్బంది వ్యవహరిస్తున్నారని ఆస్పత్రికి వచ్చే ప్రజలు ఆరోపిస్తున్నారు. వీరికి అత్యవసర చికిత్స అవసరమైతే ఎవరైనా తోడుండాలని అంటారు. ఎవరూ లేకుంటే అడ్మిషన్ ఇవ్వరు. ఒక వేళ ఇచ్చినా ప్రాథమిక వైద్యం చేసి వదిలేస్తారు. ఆధార్ కార్డు ఉందా, రేషన్ కార్డు ఉందా అని అడుగుతుంటారు. ఆస్పత్రికి వచ్చే అనాథలకు ఏమైనా శస్త్ర చికిత్స చేయాల్సి వస్తే అవి కచ్చితంగా ఉండాలి లేకుంటే శస్త్రచికిత్సలు చేయ డం కుదరదని ఆస్పత్రి వర్గాలు బదులిస్తున్నాయి. ఒక వేళ అడ్మిషన్ దొరికినా అక్కడి వార్డు సిబ్బంది సరిగా పట్టించుకోరు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటారని తెలుస్తోంది. ఎక్కడి నుంచో వచ్చి వైద్యం కోసం పడిగాపులు కాస్తూ వైద్యం అందక దిక్కులేని చావులు చస్తున్నారు. కొన్ని సార్లు ఆస్పత్రి ఆవరణలో చనిపోయిన అనాథల శవాలు తారాసపడుతుంటాయి. ఆస్పత్రిలో చనిపోయిన మృతదేహాలనూ ఆస్పత్రి అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఆరోగ్య పరిస్థితి బాగోలేక రోడ్ల పక్కన పడి ఉండే వారిని స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు గాంధీ, ఉస్మానియా ఆస్పత్రికి తరలిస్తుంటారు. ఇలాంటి వారిని ప్రాథమిక వైద్యం మాత్రమేచేసి పంపిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

# ఉప్పల్‌లో భారత్, కివీస్ వన్డే క్రికెట్ మ్యాచ్ సందడి

**భారీగా తరలివచ్చిన ప్రేక్షకులు : యధేచ్ఛగా బ్లాక్ టిక్కెట్ల దందా**



ఉప్పల్, జనవరి 18 ప్రభాతవార్త : ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగిన భారత్, న్యూజిలాండ్ వన్డే మ్యాచ్ సందర్భంగా సందడి నెలకొంది. మ్యాచ్ చూసేందుకు వివిధ రాష్ట్రాల నుంచి ప్రేక్షకులు భారీగా తరలివచ్చారు. మధ్యాహ్నం నుంచే స్టేడియంకు వెళ్లే రహదారులు కిటకిటలాడాయి. స్టేడియానికి వెళ్లే రహదారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాచకొండ పోలీసుల ఆధ్వర్యంలో స్టేడియం వద్ద భారీ ఎత్తున భద్రతా ఏర్పాట్లు చేశారు. ఐదు నెలల తర్వాత హైదరాబాద్‌లో అంతర్జాతీయ మ్యాచ్ జరుగుతుండడంతో వివిధ ప్రాంతాల నుంచి ప్రేక్షకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మ్యాచ్ వీక్షించేందుకు39 వేల మంది వస్తారని అంచనా వేయగా, టిక్కెట్ లేని వారు సైతం భారీగానే స్టేడియం వద్దకు తరలి వచ్చారు. స్టేడియం భద్రత కోసం సుమారు 2500 మంది పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేశారు. స్టేడియం వద్ద అన్ని గేట్ల వద్ద ఎసిపి స్థాయి అధికారిని పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. ప్రేక్షకులను టిక్కెట్లను పూర్తి స్థాయిలో తనిఖీలు చేసి లోపలికి పంపించారు. మ్యాచ్ వీక్షించేందుకు వివిధ ప్రాంతాల నుంచి మెట్రోరైళ్లు, ఆర్టీసీ బస్సులలో అధిక సంఖ్యలో తరలివచ్చారు.

**స్టేడియం పరిసరాల్లో ట్రాఫిక్ రద్దీతో ఇక్కట్లు ..** ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో బుధవారం జరిగిన వన్డే మ్యాచ్‌తో స్టేడియం బయట కోలాహలం నెలకొంది. ఉదయం 11 గంటల నుంచే వివిధ ప్రాంతాల నుంచి ప్రేక్షకులు స్టేడియం లోపలికి రావడం ప్రారంభించారు. మధ్యాహ్నం ఒంటి గంట మ్యాచ్ ప్రారంభ సమయానికి ముందే స్టేడియం పూర్తిగా నిండిపోయింది. స్టేడియం లోపల మూడంచెల భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేయగా, స్టేడియంలోకి వచ్చే దారులను పోలీసులు మూసివేసి టిక్కెట్లు ఉన్న వారినే లోపలికి అనుమతించారు. క్రీడాకారులు పెవిలియన్‌కు వచ్చే సమయంలో ఫోటోలు తీసేందుకు ప్రేక్షకులు పోటీ పడ్డారు. స్టేడియంలో ఉదయం నుంచి విధులు నిర్వహిస్తున్న పోలీసులకు రాత్రి వరకు కూడా సరిగ్గా భోజనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురైయ్యారు.

**భారత్, న్యూజిలాండ్ మ్యాచ్‌తో ఉప్పల్‌లో సందడి..** భారత్, న్యూజిలాండ్ మ్యాచ్ చూసేందుకు ప్రేక్షకులు అధికంగా తరలిరావడంతో గ్యాలరీలు నిండిపోయాయి. అధికశాతం మంది కాంప్లమెంటరీ పాసుల కోసమే తంటాలు పడ్డారు. కేవలం తక్కువ రేటు ఉన్న టిక్కెట్లకు మాత్రమే డిమాండ్ ఉండగా, అధిక రేట్లు ఉన్న టిక్కెట్లు కొనుగోలు చేసేందుకు ప్రేక్షకులు ఆసక్తి చూపలేదు. అదే విధంగా పలువురు రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు కాంప్లమెంటరీ పాసులు పొంది తమ బంధువులు, అనుయాయులకు ఇచ్చారు. మరోవైపు పోలీసులు, ఇతర అధికారులు ఉదయం నుంచే బందోబస్తులో ఉండడంతో రాత్రి వరకు నిరసించిపోయారు. రాజకీయ పార్టీ నేతలకు స్టేడియంలో అర్ధరాత్రి వరకు టిక్కెట్లు పంపిణీ చేయడం గమన్హారం. దీనిపై పోలీసులు పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వచ్చాయి. మరో వైపు కొందరు పోలీసు అధికారులు సైతం భారీ ఎత్తున మ్యాచ్ టిక్కెట్లు కొనుగోలు చేసి తమ బంధువులు, స్నేహితులకు పంపిణీ చేశారు.

**భారీగా స్థంభించిన ట్రాఫిక్..** ఉప్పల్‌లో జరిగిన భారత్, న్యూజిలాండ్ వన్డే మ్యాచ్ స్థానికులకు చుక్కలు చూపించింది. మ్యాచ్ వీక్షించేందుకు భారీ ఎత్తున ప్రేక్షకులు తరలిరావడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలీసులు ముందుగానే హెచ్చరికలు జారీ చేసినా స్టేడియం చుట్టు పక్కల రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేసి వెళ్లారు. ఉప్పల్ నుంచి తార్నాక వరకు, నాగోల్ రహదారి, రామంతాపూర్ రోడ్డులో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. మ్యాచ్ కారణంగా వాహనదారులు ట్రాపిక్‌లో చిక్కుకుని ఇక్కట్లు పడ్డారు.

## వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రయాణికుల నుంచి మంచి స్పందన



స్టేషన్‌లో వందేభారత్ ట్రైన్ వద్ద రద్దీ

మెట్టుగూడ, జనవరి 18 ప్రభాతవార్త: ఇటీవల సికింద్రాబాద్, విశాఖపట్నం మధ్య ప్రారంభమైన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌కు ప్రయాణికుల నుంచి అనూహ్యామైన స్పందన వస్తుందని రైల్వే అధికారులు పేర్కొంటున్నారు. కేవలం 8 గంటల వ్యవధిలో వేగంగా గమ్యానికి చేరుకుంటుండటంతో ప్రయాణికులు ఈ రైల్లో జర్నీ చేసేందుకు ఇష్టపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ ట్రైన్‌ల్లో మొదటి మూడు రోజులకు గాను వంద శాతం కంటే ఎక్కువ సామర్థ్యంతో నడువడం ఇందుకు నిదర్శనం. విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ మధ్య ప్రయాణానికి మొదటి మూడు రోజులు సగటు ఆక్యూపెన్సీ మొదటి రోజు 99శాతం రెండో రోజు 144 శాతం మూడవ రోజు 149శాంతం ఉంది. అదేవిదంగా సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం మధ్య ప్రయాణానికి, మొదటి మూడు రోజులు సగటు అక్యూపెన్సీ పెన్సీ మెదటి రోజు 122శాతం రెండో రోజు 147 శాతం మూడో రోజు 117 శాతం ఉంది. కరెంట్ బుకింగ్‌లను పరిగణలోకి తీసుకున్న తరువాత ప్రయాణం ముగిసే సమయానికి తుది ప్రయాణికుల సామర్థ్యం శాతం ఎక్కువగా ఉంటుంది. ఈ రైల్లో 14 ఏసీ చైర్ కార్ కోచ్‌లు(1024 సీట్లు),ఎగ్జిక్యూటీవ్ ఏసీ చైర్ కార్ కోచ్‌లు (104 సీట్లు), మొత్తం 1128 సీట్ల సామర్థ్యం కలిగి ఉంది. ఈ ట్రైన్ ప్రారంభం, తుది స్టేషన్లతో పాటు మధ్య స్టేషన్లు అయిన ఖమ్మం,విజయవాడ, రాజమండ్రి, స్టేషన్లలో పగలు ప్రయాణానికి ఎక్కువగా ప్రయాణికులు ఆసక్తీ చూపుతున్నారు. తెలుగు రాష్ట్రాల మధ్య ప్రయాణించేం ప్రజలకు సురక్షితమైన, అనుకూలమైన సౌకర్యవంతమైన పగటి ప్రయాణ సౌకర్యం మంచి అనుభూతిని కల్గిస్తుందని అధికారులు పేర్కొంటున్నారు.

### తెలంగాణను అభివృద్ధి చేసింది ఎన్టీఆర్, చంద్రబాబులే

చిక్కడపల్లి, జనవరి 18 ప్రభాతవార్త: తెలంగాణను అభివృద్ధి చేసింది ఎన్టీ రామారావు, చంద్రబాబులేనని తెలంగాణ టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిబాబా అన్నారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం వీధిలో బుధవారం పేదలకు అన్నదాన కార్యక్రమం పార్టీ నగర ప్రధాన కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ పలుస బాల్‌రాజ్‌గౌడ్, రామ్‌నగర్ డివిజన్ పార్టీ అధ్యక్షుడు చంద్రమోహన్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగింది. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం సాయిబాబా మాట్లాడుతూ ఎన్టీ రామారావు టిడిపిని స్థాపించి తెలంగాణకు అనేక విధాలుగా న్యాయం చేశారన్నారు.

## ఫిబ్రవరి 28న సైన్సు ఉపాధ్యాయులకు రాష్ట్ర స్థాయి సెమినార్

చార్మినార్, జనవరి 18 ప్రభాతవార్త : జాతీయ సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫిబ్రవరి నెల 28వ తేదీన సైన్సు ఉపాధ్యాయులకు రాష్ట్ర స్థాయి సైన్సు సెమినార్‌ను నిర్వహించనున్నట్లు హైదరాబాద్ జిల్లా విద్యా శాఖాధికారి ఆర్.రోహిణి ఒక ప్రకటనలో తెలిపారు.భారత దేశాన్ని స్వావలంబనంగా మార్చటానికి సైన్సు సంస్కృతిని ప్రోత్సహించటం, సైన్సులో పురోగతి, ప్రాచీన భారతీయ శాస్త్ర విజ్ఞానం, ఆధునిక కాలంలో దాని ఉపశమనం, శాస్త్రీయ జ్ఞానం, నైపుణ్య అభివృద్ధి, ప్రాథమిక స్థాయిలో ఉత్సాహాన్ని పెంచటానికి బోధన శాస్త్రంలో కళ, ఆటలు ఏకకరణ, జీవన మార్గాన్ని మార్చటానికి సైన్సు అవసరం తదితర అంశాలపై సెమినార్‌లో చర్చింటం జరుగుతుందని ఆమె తెలియజేశారు. రాష్ట్ర స్థాయి సెమినార్‌లో పాల్గొనాలనుకునే ఆసక్తి గల సైన్సు ఉపాధ్యాయులు 19వ తేదీన టి-ఎస్‌ఎటి టెలికాన్ఫరెన్స్‌లో పాల్గొని అవగాహన పొందవలసి ఉంటుందని, అనంతరం ఫిబ్రవరి నెల 2వ తేదీ లోగా తమ ధరఖాస్తులను రాష్ట్రంలోని అన్ని యాజయాన్యాలు కింద పని చేస్తున్న సైన్సు ఉపాధ్యాయులు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.టిజిఎస్‌సిఆర్‌టిమ్యాథ్స్ సైన్సు జిమెయిల్.కమ్‌కు మెయిల్ ద్వారా పంపించాలని జిల్లా విద్యాశాఖాధికారి రోహిణి తెలిపారు.

### బ్లాక్‌లో మ్యాచ్ టిక్కెట్లు విక్రయిస్తున్న 15 మంది అరెస్ట్

ఉప్పల్, జనవరి 18 ప్రభాతవార్త : ఉప్పల్‌లో బ్లాక్‌లో టిక్కెట్లు విక్రయిస్తున్న పలువురిని ఉప్పల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ మైబెల్లి తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ స్టేడియంలో జరుగుతున్న భారత్, న్యూజిలాండ్ వన్డే మ్యాచ్ టిక్కెట్లు మంగళవారం రాత్రి కొందరు యువకులు బ్లాక్‌లో విక్రయిస్తున్నారు. దీంతో ఎస్ఒటి పోలీసులు పలువురిని పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిలో జి.రమేష్, కె.వేణు, టి.అశ్రిత్, రోహిత్, ఉదయ్, ఎం.సంజీవ, కె.యశ్వంత్, మారుతీ, జి.అర్జున్‌రెడ్డి, బి.సంతోష్, ఎం.డి.అనిఫ్, ఎల్.శ్రీరామ్, ఎ.రమేష్, కె. రోహిత్‌లను పట్టుకుని వీరి వద్ద నుంచి 54 టిక్కెట్లు స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు. ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయండి



పనులను పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ పంకజ

ఎల్.బి.నగర్, జనవరి 18 ప్రభాతవార్త: నాగోల్ డివిజన్ పరిధిలో డెవలప్మెంట్ ఆఫ్ మోడల్ కారిడార్ కార్యక్రమంలో భాగంగా బుధవారం నాగోల్ నుండి అల్కపురి జంక్షన్ కొరకు ఫుట్ పాత్, సైక్లింగ్ ట్రాక్ పనులను అధికారులు పరిశీలించారు. బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి చింతల సురేందర్‌యాదవ్ పనులకు సంబంధించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఎల్బీనగర్ జోనల్‌కమిషనర్ పంకజ, హయాత్‌నగర్ ఉపకమిషనర్ మారుతిదివాకర్ నేతృత్వంలో జిహెచ్ఎంసి వివిధ విభాగాల అధికారులు పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా సురేందర్‌యాదవ్ మాట్లాడుతూ అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్ పంకజను కోరారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

### ఉప్పల్‌లో ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు



స్వర్గీయ ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఉప్పల్ టిడిపి నేతలు

ఉప్పల్, జనవరి 18 ప్రభాతవార్త : ఉప్పల్ సర్కిల్ పరిధి లోని రామంతాపూర్‌లో టిడిపి వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామంతాపూర్‌లో టిడిపి మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జీ కందికంటి అశోక్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో టిడిపి నేతలు అశోక్‌కుమార్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ వి.యాదగిరి, బండారు బిక్షపతి, కొండ్రన్‌పల్లి గిరిబాబు, గుడిసెల మల్లేష్, సర్వ సత్తయ్యయాదవ్, తిక్క ప్రకాష్, డా.అశోక్, బుర్ర నరసింహా, మహబూబ్, శివ, వేముల విజయ, అనసూయ, ఎన్.చంద్రం, రమేష్, సురేష్, పాయసం గోపాల్, లక్ష్మణ్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని పేర్కొన్నారు. పటేల్, పట్వారీ వ్యవస్థలను రద్దు చేసి పేద ప్రజలకు తమ వంతు చేయూత అందించారని కొనియాడారు. ఎన్టీఆర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.

### కంటి వెలుగులో అసౌకర్యం లేకుండా జాగ్రత్తలు

డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి



కంటి వెలుగు సెంటర్లను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

తార్నాక, జనవరి 18 ప్రభాతవార్త: డివిజన్ పరిధి లోని లాలాపేట్ ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియం, తార్నాక, నాగార్జుననగర్ కమ్యూనిటీహాల్లలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె అధికారులతో కలిసి సెంటర్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ కృషితోనే కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. కంటిచూపు సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కోంటున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎంహెచ్ఓ డా. రవీందర్, ఎస్‌పిహెచ్ఓ డా. సక్కుబాయి, మెడికల్ ఆఫీసర్ డా. సౌషీర్య, ఇంచార్జీ మల్లేష్, టీఆర్ఎస్ నాయకులు మంత్రి వినోద్ తధితరులు పాల్గొన్నారు.

## తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన మహాకవి సినారె

**తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి**

**సినీసంగీత దర్శకుడు కోటి సాలూరికి సినారె స్వర్ణకంకణ బహూకరణ**



కోటి సాలూరుకి సినారె స్వర్ణకంకణం బహూకరిస్తున్న రమణాచారి, వంశీరామరాజు, శ్రీనివాసరెడ్డి తదితర అతిథులు

రవీంద్రభారతి, జనవరి 18 ప్రభాతవార్త : తెలుగుభాషా సాహిత్యాల్లో నూతన ఒరవడిని తీసుకొని వినూత్న పదాలను సృష్టించి మెప్పించి సుసంపన్నం చేసిన మహోన్నతకవి డా. సి.నారాయణరెడ్డి మనిషే నాపతాక, నా కవిత అని సందేశమిచ్చాడని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి అన్నారు. తెలుగుగడ్డపై పుటిన శ్రీనివాసరెడ్డి భాష, సాహిత్యం, జాతాభిమానంతో విదేశాల్లోవున్నా సినారె పేరిట స్వర్ణకంకణం ఏర్పరచి అత్యుత్తమ సంగీతదర్శకుడు కోటికి బహూకరించడం సముచితమని కొనియాడారు. విశ్వవిఖ్యాత కవి, రచయిత డా. సి.నారాయణరెడ్డి రచయితగా సినీరంగ ప్రవేశంచేసి 61 సంవత్సరాలు పూర్తిచేసుకున్న శుభసందర్భంగా ప్రఖ్యాత సినీసంగీత దర్శకుడు సాలూరి కోటికి సినారె ఆళ్ల స్వర్ణకంకణం బహూకరణ కార్యక్రమం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో వంశీ ఆర్ట్ థియేటర్స్ అధినేత కళాబ్రహ్మ వంశీ రామరాజు నేతృత్వంలో ఘనంగా నిర్వహించగా అమెరికాకు చెందిన డా. ఆళ్ల శ్రీనివాసరెడ్డి సినారె పేరుమీద స్వర్ణకంకణం నెలకొల్పగా, కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి వంశీరామరాజు స్వాగతోప న్యాసం అనంతరం ఆళ్ల శ్రీనివాసరెడ్డి, తోటకూర ప్రసాద్, సినీదర్శకుడు రేలంగి నరసింహారావు, కోదండరామిరెడ్డి, బి.గోపాల్, వి.రాంబాబు, లక్ష్మీ తుమ్మల తదితరులతో కలిసి సాలూరు కోటిని ఘనంగా సత్కరించి స్వర్ణకంకణ ధారణ కావించారు. అమెరికాలో స్థిరపడిన గాయని ఆకునూరి శారద నిర్వహణలో బాలకామేశ్వరరావు, వినోద్ బాబు, రమణ, రామకృష్ణ తదితర గాయకులచే ఈపాల వెన్నెల్లో ... సినీ గాన విభావరి అధికసంఖ్యలో హాజరైన సంగీతప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకొని ఎంతగానో అలరించింది.

## భవన నిర్మాణరంగ కార్మికులకు 26 నుంచి వైద్య ఆరోగ్య పరీక్షలు

**కార్మిక శాఖ అదనపు కమిషనర్ డాక్టర్ ఇ.గంగాధర్**



చిక్కడపల్లి, జనవరి 18 ప్రభాతవార్త: రాష్ట్రంలో ఉన్న భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల ఆరోగ్యరీత్య 26వ తేదీ నుంచి అన్నిరకాల ఆరోగ్య పరీక్షలు చేపట్టబోతున్నట్లు కార్మిక శాఖ అదనపు కమిషనర్, లేబర్ వెల్ఫేర్ బోర్డు కార్యదర్శి డాక్టర్ ఇ.గంగాధర్ పేర్కొన్నారు. బుధవారం ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. కార్మికుల ఆరోగ్యం దృష్టిలో పెట్టుకుని మాస్టర్ హెల్త్‌చెకప్ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని 8 ల్యాబ్‌ల లో చేపట్టాలని నిర్ణయించినట్లు వివరించారు. కార్మికులు పనిచేసే చోటే వైద్య బృందం చేరుకుని వారికి అన్నిరకాల పరీక్షలు చేయడం జరుగుతుందని, రక్తపోటు, మధుమేహం, ఈసీజీతో పాటు తదితర పరీక్షలతో పాటు పూర్తి బాడీ చెకప్ చేస్తారని, ఈ పరీక్షల్లో ఎటువంటి రోగాలు నిర్ధారణ జరిగితే మెరుగైన వైద్యం అందించడానికి ప్రభుత్వ ఆసుపత్రులకు సిఫార్సు చేయడం జరుగుతుందని, ఈ విషయంలో కార్మికులు ఎటువంటి ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి శ్రమయోగి మంధన్ యోజన పథకం (ఈశ్రమ్)లో ఇప్పటివరకు రాష్ట్రంలో 40లక్షలమంది అసంఘటిత రంగానికి చెందిన వారు పేర్లను నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. ఈశ్రమ్ పోర్టల్‌లో అసంఘటితర ంగానికి చెందిన ప్రతి కార్మికుడు ఈ పథకంలో పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలో కోటి మంది లక్ష్యంగా నిర్ణయించామని, ఆ సంఖ్య కూడా పూర్తి చేస్తామన్నారు.

### పోచమ్మకుంటలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సరూర్‌నగర్, జనవరి 18 ప్రభాతవార్త: గుర్తు తెలియని యువకుడి మృతదేహం చెరువులో లభ్యమైన సంఘటన మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం అల్మాస్‌గూడ పోచమ్మకుంట చెరువులో మంగళవారం సాయంత్రం సుమారు 25 నుండి 30 సంవత్సరాల వయస్సు ఉన్న గుర్తు తెలియని యువకుని మృతదేహం తేలడంతో గమనించిన వారు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు మీర్‌పేట్ పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని శవాన్ని వెలికి తీసి ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు ఇన్స్‌పెక్టర్ మద్ది మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### మలక్‌పేట నియోజకవర్గంలో నేటి నుంచి కంటి వెలుగు

మలక్‌పేట, జనవరి 18 ప్రభాతవార్త: మలక్‌పేట సర్కిల్ పరిధిలో ఈనెల 19వ తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకు కంటి వెలుగు కార్యక్రమం అమలవుతుందని మలక్‌పేట సర్కిల్ ఉపకమీషనర్ జయంత్ పేర్కొన్నారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్ణీత కేంద్రాలలో పరీక్షలు జరుగుతాయని తెలిపారు. కంటి వెలుగు కేంద్రాలలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. కంటి వెలుగు కేంద్రాలను కార్పొరేటర్లు కొత్తకాపు అరుణ, బొక్క భాగ్యలక్ష్మి, డాక్టర్ జువేరియాఫాతిమా, సయ్యద్ మినాజుద్దీన్, మహమ్మద్ అబ్దుల్‌సలాంషహీద్, అయోషాజహన్, ఎమ్మెల్సీ మిర్జారియాజ్, అలంధర్ హుస్సేన్‌ఖాన్ ప్రారంభిస్తారని తెలిపారు.

### కెసిఆర్, కేటీఆర్‌లపై పోలీసులకు ఫిర్యాదు

ఎల్.బి.నగర్, జనవరి 18 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి కెసిఆర్, ఐటిశాఖ మంత్రి కేటీఆర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశామని అవసరమైన చర్యలు తీసుకోవాలని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్‌కుమార్ పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీపై ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేశారని వారిపై చర్యలు తీసుకోవాలని బుధవారం సరూర్‌నగర్ ఇన్స్పెక్టర్ సీతారాంకు ఆమె లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ ప్రధాని అనే గౌరవం లేకుండా ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు అన్నారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న కేసీఆర్ భావితరాలకు ఎటువంటి సందేశం ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రశ్నించే వారిపై రాష్ట్ర ప్రభుత్వం నిరాధారమైన కేసులు పెడుతుందని కార్పొరేటర్లు వంగా మధుసూదన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

## తెలుగు జాతి ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటిన మహనీయుడు ఎన్టీఆర్

ప్రభుత్వవిప్ గాంధీ



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ప్రభుత్వవిప్ గాంధీ

కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 18, ప్రభాతవార్త : తెలుగుజాతి ఇలవేలుపు,మరణంలేని జననం విశ్వవిఖ్యాత, నటసార్వభౌమ, నటరత్న నందమూరి తారక రామారావుదేనని ప్రభుత్వవిప్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. బుధవారం పద్మశ్రీ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డా.నందమూరి తారక రామారావు 27వ వర్థంతి సందర్భంగా ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండలో స్థానిక కార్పోరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి ప్రభుత్వవిప్ అరికెపూడి గాంధీ ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగువారి గుండెల్లో చెరగని ముద్రను చిరస్థాయిగా వేసుకున్న నాయకుడు, విశ్వవిఖ్యాత, నటసార్వభౌమ, నటరత్న, పద్మశ్రీ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డా.నందమూరి తారక రామారావు అని అన్నారు. అదేవిధంగా ఎంతో మందికి ఆయన స్ఫూర్తి ప్రధాత అని కొనియాడారు. రాజకీయాలకు నూతన నిర్వచనం ఇచ్చి కోట్లాది జీవితాలలో వెలుగునింపిన మమనీయుడు ఎన్‌టిఆర్ అని అన్నారు. ఆయన మరణంలేని జననం అని తెలుగువాడి కీర్తిని నలుదిశలా ప్రపంచ వ్యాప్తంగా చాటిచెప్పిన యుగపురుషుడు ఎన్‌టిఆర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు దొడ్ల రామకృష్ణగౌడ్, కాశినాథ్‌యాదవ్, జి.శ్రీనివాస్, వాసుదేవరావు, కిషన్, మున్నా, కాజా, శివ, బాలస్వామి, మల్లేష్, కుర్మయ్య, బాలరాజు, రాజీవ్, రాజ్‌పటేల్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## ఖైరతాబాద్‌లో నేటి నుంచి కంటి వెలుగు

ఖైరతాబాద్, జనవరి 18 ప్రభాతవార్త: బస్తీల, కాలనీలలో అర్హులైన వారికి నేటి నుంచి కంటి వెలుగు నిర్వహిస్తున్నట్లు బల్దియా డిఎంసి మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటివెలుగు ఈ నెల అనగా జనవరి 19 నుండి ప్రారంభం కానుందని, అందుకోసం అన్ని విధాలుగా ఏర్పాట్లకు సన్నద్ధం అయ్యామని అంటున్నారు. అందుకు ప్రాంతాల వారీగా ఇన్‌ఛార్జీలను నియమించామని ఆయన తెలిపారు. ఖైరతాబాద్ జోనల్‌లో తమ కమిషనర్ ఆదేశాలనుసారం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకున్నామని అంటున్నారు. ఇలాంటి కార్యక్రమాన్ని స్థానికంగా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. తమ పరిధిలోని అన్ని ప్రాంతా లలో కంటి వెలుగు నిర్వహిస్తున్నామని మోహన్ రెడ్డి తెలిపారు. కమిషనరు రవికిరణ్ నేతృత్వంలో ఇప్పటికే కంటివెలుగుకు సంబంధించిన వారందరిని అప్రమత్తం చేశామని చెప్పారు.

## బేగంపేట్ సర్కిల్ పరిధిలో నేటి నుంచి కంటివెలుగు పరీక్షలు: డీఎంసీ

సికింద్రాబాద్, జనవరి 18 ప్రభాతవార్త : జీహెచ్ఎంసీ బేగంపేట్ సర్కిల్ పరిధిలో 19వ తేదీన గురువారం 6 సెంటర్‌లలో కంటివెలుగు కార్యాక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు డిప్యూటీ కమిషనర్ ముకుందరెడ్డి తెలిపారు. సర్కిల్ పరిధిలోని బస్సీలాల్‌పేట్ హమాలిబస్తీలోని బస్తీదవాఖాన, కీస్ కమ్యూనిటీహాల్ న్యూబోయిగూడ, రాంగోపాల్‌పేట్‌లో కవిక్టోరియా గంజ్ విక్టోరియా కమ్యూనిటీహాల్, బేగంపేట్‌లోని మోడల్‌మార్కెట్ పాటిగడ్డ, ఓల్డ్‌కస్టమ్ బస్తీ బేగంపేట్ కమ్యూనిటీహాల్, మోండామార్కెట్ డొక్కలమ్మ టెంపుల్ కమ్యూనిటీహాల్ నాలాబజార్. ఈ కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచితంగా కంటి పరీక్షలు జరిపి అవసరమైన వారికి కంటి అద్దాలు ఉచితంగా అందజేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలని డీఎంసీ ముకుందరెడ్డి కోరారు.

## దేశంలో బిఆర్ఎస్ అధికారంలోకి వస్తుంది : ఎమ్మెల్యే సాయన్న



కంటోన్మెంట్ నుంచి ఖమ్మం సభకు తరలివెళ్తున్న ఎమ్మెల్యే సాయన్న, టిఆర్ఎస్ శ్రేణులు తదితరులు

కంటోన్మెంట్, జనవరి 18 ప్రభాతవార్త: భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) దేశంలో అధికారంలోకి వస్తుందని కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే జి.సాయన్న తెలిపారు. బుధవారం ఖమ్మంలో నిర్వహించిన బిఆర్ఎస్ తొలి ఆవిర్భావ సభకు కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే సాయన్న తారధ్యంలో వందలాది మంది బిఆర్ఎస్ శ్రేణులు ఖమ్మం బిఆర్ఎస్ గర్జన సభకు తరలివ వెళ్ళారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్, టిఆర్ఎస్ నాయకులు నివేదిత, పనస సంతోష్, సదానంద్ గౌడ్, అజయ్, తేజ్‌పాల్, దేవులపల్లి శ్రీను, భాస్కర్ ముదిరాజ్, నాగినేని సరిత, పరశరామ్ తదితరులు పాల్గొన్నారు.

## భారతమాత మహా ఆర్తిక్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



ఆహ్వాన పత్రికలను పంపిణి చేసిన మహాలక్ష్మీరామన్‌గౌడ్

హైదరాబాద్, జనవరి 18 ప్రభాతవార్త: ఈ నెల 22వ తేదీన భారత్ మాతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడే 'భారతమాత మహా ఆర్తిక్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డివిజన్ కార్పోరేటర్ జి.మహాలక్ష్మీరామన్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం డివిజన్‌లో బిజెపి కార్యకర్తలకు ఆమె ఆహ్వాన పత్రికలను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు జి.రామన్‌గౌడ్, నర్సింగ్‌గౌడ్, మహేష్, జైస్వాల్, మల్లేష్, జాకి, శేఖర్, సాయి, హితేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఖమ్మం సభకు మల్లాపూర్ నుంచి తరలివెళ్లిన బీఆర్ఎస్ నేతలు



మల్లాపూర్ డివిజన్ నుంచి ఖమ్మం సభకు తరలివెళ్లుతున్న కార్పోరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి నాయకులు

నాచారం, జనవరి 18 ప్రభాతవార్త: ఖమ్మంలో భారత్ రాష్ట్ర సమితి నిర్వహించిన పార్టీ ఆవిర్భావ సభకు మల్లాపూర్ డివిజన్ నుంచి పలువురు తరలివెళ్లారు. కార్పోరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పోరేటర్ కొత్తరామారావు, మల్లాపూర్ డివిజన్ నాయకులు తాండ వాసుదేవ్ గౌడ్, కోదండం ధర్మారెడ్డి, శ్రీధర్‌రెడ్డి తధితరులు పాల్గొన్నారు.

## కంటి వెలుగు కార్యక్రమం ఏర్పాట్ల పరిశీలన



నార్సింగి మున్సిపల్ పరిధిలో కంటి వెలుగు కార్యక్రమం ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ సుదేరా

నార్సింగి, జనవరి 18 ప్రభాతవార్త : నార్సింగి మున్సిపల్ పరిధిలోని కంటి వెలుగు కేంద్రాలను బుధవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ సుదేరా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ నిరుపేదలకు కంటి వెలుగు కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. రంగారెడ్డి జిల్లా డిఎంహెచ్ఓ డాక్టర్ సృజన, గండిపేట మండల వైద్యాధికారి డాక్టర్ పద్మ, డాక్టర్ మిసాబ్, హెఇఒ శ్రీనివాస్, పిహెచ్ఎన్ వెంకటలక్ష్మీ, తేజ, ఆశ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.





సికింద్రాబాద్ జెబిఎస్ వద్ద ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న టిడిపి నేతలు అశోక్, నర్సింగ్‌రావ్, మధు, అంజయ్య తదితరులు, చిన్నారులతో బెలూన్స్ ఎగురవేస్తున్న కార్వాన్ టీడీపీ నాయకులు





వర్థంతి కార్యక్రమంలో సంతోష్ సాగర్, ఎన్టీఆర్ వర్థంతి సందర్భగా నివాళులు అర్పిస్తున్న టీడీపీ నేతలు





మెట్టుగూడలో ఎన్టీఆర్ వర్థంతిలో పాల్గొన్న నాయకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ప్రభాకర్‌రెడ్డి తదితరులు

# తెలుగు జాతి గర్వించ దగ్గ వ్యక్తుల్లో ఎన్టీఆర్ అగ్రగణ్యుడు

**తెలుగు జాతికి ఎన్టీఆర్ సేవలు మరువలేనివి : అశోక్**

**అడ్డగుట్ట..** తెలుగు జాతికి దివంగత మాజీ ముఖ్య మంత్రి ఎన్టీఆర్ చేసిన సేవలు మరువలేనివని టిడిపి ఎస్సీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ కుమార్ తెలిపారు. ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం సికింద్రాబాద్ జెబిఎస్ వద్ద ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.నర్సింగ్ రావ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు అశోక్ ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. ఎన్టీఆర్ స్థాపించిన టిడిపితోనే తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ చైతన్యం వచ్చిందన్నారు. ఎన్టీఆర్ హాయాంలోనే బడుగు బలహీన వర్గాల పేద ప్రజలకు మేలు జరిగిందన్నారు. కంటోన్మెంట్‌లో టిడిపిని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా ఉద్యమించాల న్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్న దానం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు మధుసూదన్, బి.ఎస్.ఏ.రాజు, డి.ఆర్.శ్రీనివాస్, రవిందర్, ఎన్.అంజయ్య ముదిరాజ్, కె.ప్రతాప్, మేకల చంద్రశేఖర్, ప్రమోద్, గోపి, మహేశ్ యాదవ్, కట్టెల శ్రీనివాస్ యాదవ్, మహిళా నాయకురాళ్ల జోస్నా, అనురాధ పాల్గొన్నారు.

**ఎన్టీఆర్‌తోనే రాజకీయ చైతన్యం వచ్చింది : గౌరి శంకర్‌యాదవ్**

తెలుగు రాష్ట్రాల్లో ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీతోనే రాజకీయ చైతన్యం వచ్చిందని మల్కాజిగిరి పార్లమెంట్ టిడిపి ఆర్గనైజింగ్ సెక్రెటరీ బి. గౌరి శంకర్‌యాదవ్ తెలిపారు. ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం రెజిమెంటల్ బజార్‌లో ఏర్పాటు చేసిన వర్ధంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు పండ్లు, బ్రెడ్లు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలోటిడిపి నాయకులు టీ.ఎన్.నరహరి, బి.బాబు, నామ్ దేవ్, నర్సింగరావ్, అంజనేయులు, రాజు, శ్రీధర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

**భక్తి శ్రద్దలతో ఎన్టీఆర్ వర్ధంతి**

**అల్వాల్..** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు స్వర్గీయ ఎన్టీఆర్ వర్ధంతిని పార్టీ శ్రేణులు భక్తి శ్రద్దలుతో నిర్వహించడం జరిగింది. టిటిడిపి రాష్ట్ర కార్యదర్శి సంతోష్ సాగర్ ఆధ్వర్యంలో వెంకటాపురం డివిజన్ పరిధిలోని కానాజీగుడ సుభాష్‌నగర్‌లలో జరిగిన కార్యక్రమంలో నేతలు కార్యకర్తలు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు జాతి గర్వించ దగ్గ వ్యక్తులులో ఎన్టీఆర్ ముందు వరసలో ఉంటారని సంతోష్ సాగర్ తెలిపారు. పేద ప్రజలు అభ్యున్నతికి ఆయన చేసిన సేవ నేటికి చిరస్మరణీయంగా ఉందని కొనియాడారు. ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని విద్యార్థులు ప్రజలకు పళ్ళు పంపిణీ చేయడం జరిగింది.

**తెలుగు జాతికి ఎన్టీఆర్ వల్లే ప్రపంచవ్యాప్త గుర్తింపు : టీడీపీ**

**సికింద్రాబాద్..** తెలుగు రాష్ట్రానికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తీసుకువచ్చిన ఘనత స్వర్గీయ ఎన్టీఆర్‌కే దక్కుతుందని టీడీపీ సికింద్రాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాస్ కుమార్ అన్నారు. ఎన్టీఆర్ 27వ వర్ధంతి సందర్భంగా నియోజకవర్గంలోని వారాసిగూడ చౌరస్తా, నామాలగుండు చౌరస్తాలలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యాక్రమంలో పాల్గొన్నక సందర్భగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజులలో టీడీపీ పూర్వ వైభవం సంతరించుకుంటుందని తెలిపారు. పార్టీనే నమ్ముకొని ప్రజాసేవల్లో చురుకుగా ఉంటున్న నేతలు, కార్యాకర్తలకు ఎప్పటికైనా గుర్తింపు లభిస్తుందని, ఇందు కోసం ఎన్టీఆర్ ఆశిస్సులు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ యాదవ్, పొట్టిశ్రీను, ప్రవీన్‌కుమార్, వెంకటస్వామి, అశోక్‌ముదిరాజ్, చంద్రమోహన్, శంకర్, రవి, సుధాకర్, రాజు, లక్ష్మణ్ ముదిరాజ్, జగదీశ్‌గౌడ్, మల్లేష్ యాదవ్, విజయ్, రామారావు, ప్రసాదరావు, శ్రీను, బాలకృష్ణ, సాయి పాల్గొన్నారు.

**తెలుగువారి కీర్తిప్రతిష్టలను ప్రపంచానికి తెలియజేసింది ఎన్టీఆర్**

**సైఫాబాద్..** తెలుగువారి కీర్తి ప్రతిష్టలను ప్రపంచ వ్యాప్తంగా ఇనుమడింపజేసిన నందమూరి తారక రామారావు చేసిన సేవలు మరువలేనివని లోక్‌దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరాజేశ్వర్‌రావు కొనియాడారు. తెలుగుదేశం పార్టీ ఏర్పాటు చేసి అనతి కాలంలో ముఖ్యమంత్రి అయి చరిత్ర సృష్టించారని, సినిమారంగంలో విశేషమైన సేవలు అందించి తిరుగులేని మకుటం లేని మహారాజ్‌గా వెలుగొందిన ఎన్‌టిఆర్ తెలుగువారి హృదయాలలో చిరస్మరణీయుడని చెప్పారు. బుధవారం లోక్‌దళ్ పార్టీ కార్యాలయంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించి మాట్లాడారు. సిఎంగా ఉన్న ఎన్‌టిఆర్ పేద, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలు చేపట్టి అమలు చేశారని ఆయన తెలిపారు. రెండు రూపాయలకే కిలో బియ్యం, జనతా వస్త్రాలు, 50 రూపాలకే విద్యుత్ సరఫరా తదితర ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిన మహనీయుడని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజేష్, వెంకన్న, సంజీవ్, ఖాదర్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి**

**మెహిదీపట్నం..** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు 27వ వర్ధంతి వేడుకలు బుధవారం కార్వాన్ నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర నాయకులు బండారి వెంకటేష్ ఆధ్వర్యంలో లంగర్‌హౌస్ డివిజన్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం గుడిమల్కాపూర్ డివిజన్ జ్యోతిరావు పూలే చౌరస్తాలో పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా బండారి వెంకటేష్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బుగిడి అనూప్ కుమార్‌లు మాట్లాడుతూ...తెలుగువారి ఆత్మాభిమానం కోసం అవిర్భవించిన పార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు. బడుగు బలహీన వర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిన ఘనత రామారావుకు దక్కుతుందన్నారు. అనంతరం స్కూల్ విద్యార్థిని, విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్ సింగ్, అహ్మజద్ అలీఖాన్, లక్ష్మణ్ యాదవ్, చంద్రశేఖర్ గౌడ్, నర్సింగ్‌రావు, వినోద్, సురేష్, కైరుద్దీన్, దేవేందర్, నగేష్, శివరాజ్, ఉమేష్, కమలేష్ కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు.

**మెట్టుగూడలో ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి**

**మెట్టుగూడ..** మెట్టుగూడ డివిజన్‌లో టీడీపీ ఆధ్వర్యంలో ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ టీడీపీ ఇంచార్జి వల్లారపు శ్రీనివాస్‌తో పాటు నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘ నంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తడక వినోద్‌కు మార్, మల్లేష్ యాదవ్, చిరంజీవి రాజు, శషిరేఖ, రాపోలు సురేష్, శివప్రసాద్, మార్టిన్, మహేందర్ నాయక్ పాల్గొన్నారు.

**మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీఆర్‌కు ఘన నివాళి**

**దుండిగల్..** మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు వర్ధంతి సందర్భంగా గండిమైసమ్మలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా జడ్పీమాజీ వైస్‌చైర్మన్ బొంగునూరి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన అందించిన మహానేత, మహనీయుడు ఎన్టీఆర్ అన్నారు. ఆయన ఆశయసాధన కోసం ఆయన చూపిన మార్గంలో మనందరం నడవాలన్నారు. కార్యక్రమంలో బొడ్డు రవిశంకర్, పుల్లయ్యచౌదరి, నాగరాజుచౌదరి, రమణచౌదరి, రంగరావు, రాజశేఖర్‌యాదవ్, నరసింహారావు, సాయియాదవ్, సురేష్‌చౌదరి, వెంకటేష్, జగన్, సాయి, బ్రహ్మతేజ, వెంగమనాయుడు, నారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు జేఎన్ఏఎఫ్ఏయు 4వ స్నాతకోత్సవం

**వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎన్.కవితా దర్యాణిరావు వెల్లడి**




ప్రొఫెసర్లు కుమార్, వినోద్ గణేష్‌లతో కలిసి మాట్లాడుతున్న వి.సి ధర్యాణిరావు

హైదరాబాద్, జనవరి 18, ప్రభాతవార్త: జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ (జెఎన్ఏఎఫ్ఏయు) 4వ స్నాతకోత్సవం గురువారం యూనివర్సిటీ ప్రాంగణంలో జరగనున్నట్లు వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ ఎన్.కవితా దర్యాణిరావు తెలిపారు. ఈమేరకు బుధవారం మాసబ్‌ట్యాంక్‌లోని యూనివర్సిటీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డైరెక్టర్ అకాడమిక్ అండ్ ప్లానింగ్ ప్రొఫెసర్ వినోద్ గణేష్, డైరెక్టర్ ఎవాల్యువేషన్ ప్రొఫెసర్ ఎస్.కుమార్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగే ఈకాన్వకేషన్‌కు ముఖ్యఅధిదిగా ఐఐటి హైదరాబాద్ డైరెక్టర్ డా.బి.ఎస్ మూర్తి హాజరవుతారని అలాగే తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరాజన్ వర్చువల్‌గా పాల్గొని సభను ఉద్దేశించి ప్రసంగిస్తారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు 6పిహెచ్‌డిలు, 114 బంగారు పతకాలు, 612 ఇతర డిగ్రీలు ప్రధానం చేస్తామని తెలిపారు. అలాగే నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020 ప్రకారం విశ్వవిద్యాలయవిద్యాకార్యక్రమాలను మార్చే ప్రక్రియలో ఉన్నామని ఇంటీరియల్ డిజైన్, ఫోటోగ్రఫీలో చాలా ఆసక్తి పెరుగుతుందని అందుకు ఏడాది కోర్సును త్వరలో పరిచయం చేసేందుకు సిద్ధమవుతున్నామన్నారు. ప్రొఫెసర్ ఎస్.కుమార్ మాట్లాడుతూ నేడు ప్రధానం చేయబోయే ఆరు డాక్టరేట్‌లలో ఆర్కిటెక్చర్ ఫ్యాకల్టీలో రెండు, ప్లానింగ్ ఫ్యాకల్టీలో ఆరు ఉన్నాయన్నారు. ప్రొఫెసర్ ఎం.వినోద్ గణేష్ మాట్లాడుతూ 2008లో స్థాపించబడిన ఈయూనివర్సిటీ లక్ష్యం ఆర్ట్ అండ్ డిజైన్ ప్రపంచంలో సృజనాత్మక, అనువర్తిత బాధ్యతల కోసం విద్యార్థులను సిద్ధం చేయడమేనన్నారు. విద్యార్థులు, ప్రొఫెసర్లు అందరూ హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ఎలక్ట్రిసిటీ అకౌంట్స్ స్టాఫ్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న ప్రభాకర్‌రావు, రఘుమారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ఈశ్వర్‌గౌడ్ తదితరులు

హైదరాబాద్, జనవరి 18, ప్రభాతవార్త: విద్యుత్ ఉద్యోగుల ప్రధాన డిమాండ్ పిఆర్‌సి, ఈపిఎఫ్‌టు జిపిఎఫ్ సమస్యను సిఎం కెసిఆర్‌తో మాట్లాడి త్వరలో పరిష్కరిస్తామని ట్రాన్స్‌కో, జెన్‌కో సిఎండీ ప్రభాకర్‌రావు అన్నారు. ఈమేరకు బుధవారం విద్యుత్‌సౌధలోని ఆడిటోరియంలో తెలంగాణ ఎలక్ట్రిసిటీ అకౌంట్స్ స్టాఫ్ అసోసియేషన్ (టిఈఎఎస్ఎ) ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర డైరీని టిఎస్ఎస్‌పిడిసిఎల్ సిఎండీ జి.రఘుమారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ప్రభాకర్‌రావు మాట్లాడుతూ విద్యుత్ సంస్థల అభివృద్ధికి ఉద్యోగులందరూ సమన్వయంతో సమిష్టిగా కృషి చేయాలన్నారు. రఘుమారెడ్డి మాట్లాడుతూ సంస్థ అంతర్గత సామర్థ్యం పై ఉద్యోగులందరూ కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.కరుణాకర్‌రెడ్డి, సెక్రటరీ బి.ఈశ్వర్‌గౌడ్, రాజు, వెంకటేశ్వర్లు, ఈశ్వరయ్యగౌడ్, సాంబశివ రావు, అశోక్, ప్రభాకర్‌రావు, బాలరాజు, కుమారస్వామి, వేద ప్రకాశ్, మీణ, పావని తదితరులు పాల్గొన్నారు.

## సకలకళల సమ్మేళనం కళా హేమంతం

**హాస్యావధాని డా. శంకరనారాయణ**




పురస్కార గ్రహీతలతో డా. శంకరనారాయణ, రమ్య, దైవజ్ఞవర్మ

రవీంద్రభారతి, జనవరి 18 ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీరాగరమ్యం కల్చరల్ సోషల్ యాక్టివిటీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సంస్థ 4వ వార్షికోత్సవ సాంస్కృతిక వేడుకలను పురస్కరించుకొని రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో అంగరంగ వైభవంగా జరిగిన సకల కళల సమ్మేళనం కళా హేమంతమని ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ హాస్యావధాని, సీనియర్ పాత్రికేయుడు హాస్యబ్రహ్మ డా. శంకరనారాయణ ప్రస్తుతించారు. శ్రీరాగరమ్యం సంస్థ తమ నాల్గవ వార్షికోత్సవ వేడుకలను మన సంస్కృతి, సంప్రదాయాలు, కళలను కాపాడుకొంటూ, ప్రోత్సహిస్తూ వివిధ సాంస్కృతిక కళా, సాహిత్య కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించడం ముదావహమని సంస్థను, సంస్థ నిర్వాహకురాలు రమ్యని ఎంతగానో అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పోలీసు ఆఫీసర్ల అసోసియేషన్ రాష్ట్రాధ్యక్షుడు యేదుల గోపిరెడ్డి, ఏపి ఇన్‌ఫర్మేషన్‌శాఖ పూర్వ కమిషనర్ ఆర్.దిలీప్‌రెడ్డి, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు రమ్య, సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొని ఈ వేడుకల్లో అద్భుత సాంస్కృతిక, సాహిత్య ప్రదర్శనలిచ్చిన కళాకారులను ఘనంగా సత్కరించారు.

## పాతబస్తీలో ఘనంగా ఎన్‌టిఆర్ వర్ధంతి



కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర టిడిపి నాయకులు డాక్టర్.ఆవుల భరత్ ప్రకాష్, పెద్దోజు రవీంద్ర చారి తదితరులు

చార్మినార్, జనవరి 18 ప్రభాతవార్త : చార్మినార్ నియోజకవర్గంలోని కోవా బేలా చౌరస్తా, లాల్‌దర్వాజ చౌరస్తా, పార్థివాడ, యాకుత్‌పుర నియోజకవర్గంలోని గౌలిపుర ప్రాంతాలలో బుధవారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 27వ వర్ధంతి కార్యక్రమాన్ని టిటిడిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శులు డాక్టర్ ఆవుల భరత్ ప్రకాష్, పెద్దోజు రవీంద్రచారితో పాటు పలువురు నాయకులు పాల్గొని మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్‌టిఆర్ చిత్ర పటానికి పూల మాలలు వేసిఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జోగేందర్ సింగ్, మాజీ కార్పొరేటర్ శంకర్ ముదిరాజ్, సి.శివకుమార్ యాదవ్, అంబాదాస్ దేర్గేష్, ఎంఎ షఫీక్, బి.వై శ్రీ కాంత్, సల్లా రాజ్ కుమార్, కె.శ్రీకాంత్, ఎం యాదయ్య, ఎం.రామచందర్, నర్సింగరావు, నితీష్ కుమార్, పి.శ్రీనివాస్, అరుణేష్, వగ్గు బాలరాజ్, ఎ.చంద్రకుమార్, ఎండి చాంద్ పాషా, అనికేత్, జి.మాధవరావు పాల్గొన్నారు.

## ఎన్‌టిఆర్ ఘాట్ వద్ద పూలమాలలు వేసి నివాళ్లు



దివంగతనేత మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ ఘాట్ వద్ద నివాళ్లు ఆర్పిస్తున్న టిడిపి నాయకులు దినేష్ కేడియా

బేగంబజార్, జనవరి 18 ప్రభాతవార్త: తెలుగు దేశంపార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నందమరి తారకరామారావు వర్ధంతిని పురస్కరించుకుని ఎన్‌టిఆర్ ఘాట్ వద్ద గోషామహల్ నియోజకవర్గం టిడిపి నాయకులు రాంనారాయణ్ యాదవ్, దినేష్‌కుడియా, వినోద్‌కుమార్, డి.గోపాల్‌రావు, నర్సింగ్ ప్రసాద్, సోమశేఖర్ తదితరులు వెళ్లి పూలమాలలు వేసి నివాళ్లు ఆర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు దేశంపార్టీ స్థాపించిన తరువాతనే అన్ని వర్గాల ప్రజలకు సముచిత స్థానం లభించిందన్నారు. ముఖ్యంగా తెలుగు దేశం పార్టీ హాయంలోనే రెండు రూపాయల కిలలో బియ్యం పేద ప్రజలకు అందచేసిన ఘనత ఎన్‌టిఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## నడ్డా పదవీకాలం పెంచడంతో సంబురాలు



మిఠాయిలను పంచి పెడుతున్న జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్

అఫ్జల్‌గంజ్, జనవరి 18 ప్రభాతవార్త: బజెపి జాతీయ అధ్యక్షులుగా జెపి నడ్డా పదవి కాలం పెంచుతూ పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకోవడం పట్ల జాంబాగ్ డివిజన్ బిజెపి కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్ ఆధ్వర్యంలో బిజెపి డివిజన్ నాయకులు సంబురాలు చేసుకున్నారు. బుధవారం సిబిఎస్ వద్ద కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్ ఆధ్వర్యంలో టపాసులు కాల్చి, ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు, నాయకులకు మిఠాయిలను పంచి పెట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ పార్టీ అధ్యక్షులుగా జెపి నడ్డా సమర్దవంతమైన సేవలందించి పార్టీ నాయకులకు, కార్యకర్తలకు నూతనోత్సాహం తీసుకు వచ్చినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు అనిల్‌యాదవ్, రామకృష్ణ, రఘుకాంబ్లే, ప్రవీణ్‌బాబు, రేణుక, జగపతినాయక్, సందీప్, సురేష్, రామకాంత్‌వ్యాస్ సాయిరామ్ పాల్గొన్నారు.

## అఖిలేష్‌యాదవ్‌ను కలిసిన డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు

హైదరాబాద్, జనవరి 18, ప్రభాతవార్త: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు అఖిల్‌యాదవ్‌తో భేటీ అయ్యారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి పలుఅంశాలపై చర్చించారు. ఈసందర్భంగా అఖిలేష్ దేశంలో ప్రస్తుతం నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల్లో మేధావులు, విద్యావంతులు క్రియాశీలక పాత్ర పోషించాలనిం గా దేశలౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడుకునేందుకు అందరూ ముందుకు రావాలని కోరినట్లు తెలిపారు. చైతన్యవంతమైన తెలంగాణా దేశానికి దిక్సూచిగా నిలిచేలా చొరవ తీసుకోవాలని సూచించినట్లు వర్రె వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

## గండిపేట మండలం నుంచి ఖమ్మం సభకు తరలివెళ్లిన బిఆర్ఎస్ నాయకులు



నార్సింగి, జనవరి 18 ప్రభాతవార్త : బిఆర్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఖమ్మం సభకు గండిపేట్ మండలం నుంచి బిఆర్ఎస్ నాయకులు, కార్య కర్తలు పెద్దఎత్తున తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో రాజేంద్ర నగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్, మండలి బిఆర్ఎస్ అధ్యక్షులు నర్సింహ్మా, మాజీ ఎంపిపి మల్లేష్, సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ మేయర్ మహేందర్ గౌడ్, డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, అధ్యక్షులు సురేష్ గౌడ్, కార్పొరేటర్లు చంద్రశేఖర్, పద్మావతి పాండు, సంతోషి రాజిరెడ్డి, రవీందర్ రెడ్డి, లతప్రేమ్‌గౌడ్, సాగర్‌గౌడ్, మణికొండ ఫ్లోర్ లీడర్ రామకృష్ణరెడ్డి, అధ్యక్షులు శ్రీరాములు, నార్సింగి మున్సిపల్ చైర్మన్ రేఖ యాదగిరి, వైస్ చైర్మన్ వెంకటేష్ యాదవ్, కౌన్సిలర్లు శివారెడ్డి, శ్రీకాంత్, విజిత, ప్రశాంత్ యాదవ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఉపేందర్

## విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

**-డాక్టర్ మన్నే ఉపేందర్**

**పాపన్నపేట, జనవరి 18,ప్రభాతవార్త:** విద్యార్థులు క్రమ శిక్షనతో విద్యను అందుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అమెరికా దేశ మాజీ అధ్యక్షులు బరాక్ ఒబామా వైద్య సలహాదారు డాక్టర్ మన్నె ఉపేందర్ అన్నారు. తను విద్యను అందుకున్న మండల కేంద్రమైన పాపన్నపేట పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులు బుధవారం ప్రేరణ కల్పించారు. చంద్రుడి వైపు లక్ష్యం పెడితే కనీసం నక్షత్రాలైన అందుకోగలుగుతారని సూచించారు. తాను ఇదే పాఠశాలలో 10వ తరగతి వరకు విద్యను అందుకుని ఉన్నత స్థాయికి చేరుకోగలిగానని గుర్తు చేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి నీలకంఠం, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరిసింగ్, ఉపాధ్యాయులు, గ్రమ సర్పంచ్ గురుమూర్తిగౌడ్, ఎంపిటిసి సభ్యులు ఆకుల శ్రీనివాసన తదితరులు పాల్గొన్నారు.

## మామిడ్గిలో సిసి రోడ్డు పనులు ప్రారంభం



సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ చంద్రప్ప

**న్యాల్‌కల్, జనవరి 18, ప్రభాతవార్త:** మండలంలోని మామిడ్గి గ్రామంలో బుధవారం సిసి రోడ్డు పనుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గ్రామ సర్పంచ్ చంద్రప్ప రోడ్డు నిర్మాణ పనులను భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. గ్రామాభివృద్దే లక్ష్యంగా గ్రామస్థులు, వార్డు సభ్యుల సహకారంతో పనులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో నేరాలు జరగకుండా ఉండేందుకు 16 సిసి కెమెరాలను సైతం ప్రారంభించడం జరిగిందన్నారు.

## నిబంధనలకు అనుగుణంగా వాహనాలను నడపాలి : ఎస్సై



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ వినయ్‌కుమార్

**న్యాల్‌కల్, జనవరి 18, ప్రభాతవార్త :** రోడ్డు నిబంధలను అనుగుణంగా వాహనాలను రోడ్లపై నడుపుకోవాలని ఎస్ఐ వినయ్‌కుమార్ సూచించారు. బుధవారం మండలంలోని గంగ్వార్-అల్లాదుర్గం రోడ్డులో మండలంలోని ముంగి గ్రామ శివారులో వాహనాలను తనిఖీ చేశారు. వాహన చోదకులు విధిగా పత్రాలను దగ్గర పెట్టుకుని వాహనాలను తోలాలన్నారు. లైసెన్సు, ఇన్సురెన్సు పత్రాలు లేకుండా వాహనాలన నడపరాదని సూచించారు. ఆటోల్లో ప్రయాణీకులను అధికంగా ఎక్కించుకుని తోలరాదని, ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందని గుర్తు చేశారు. ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ లేనిదే రోడ్డుపైకి రావద్దని సూచించారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందజేత

**గుమ్మడిదల, జనవరి 18, ప్రభాతవార్త:**

గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామానికి చెందిన (బేకు బాలపోచమ్మ) అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా సమాచారాన్ని తెలుసుకున్న పటాన్‌చెరు శాసనసభ్యులు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తే స్పందించి తన సోదరుడు గూడెం మధుసూదన్‌రెడ్డి ద్వారా ఆకుటుంబానికి అండగా నిలుస్తూ పది వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గుమ్మడిదల మండల వైస్ ఎంపీపీ నక్క మంజుల వెంకటేష్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు కుమ్మరి వెంకటేష్, పార్టీ గ్రామ అధ్యక్షులు రాళ్ళబండి ముద్రిక చారి, ఉపాధ్యక్షులు జంగిటి మల్లేష్, పార్టీ ప్రధాన కార్యదర్శి తుడుము కాంతారావు, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పుట్టనాగులు, పార్టీ సీనియర్ నాయకులు కృతం బాల్‌రెడ్డి, మహమ్మద్ హర్షద్, బేకు అశోక్, ప్రసాద్, శేఖర్ పద్మారెడ్డి పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ పాఠశాలకు పాఠ్య సామాగ్రి పంపిణీ

**అల్లాదుర్గం, జనవరి 18, ప్రభాతవార్త:**

ముప్పారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి గ్రామ ఉప సర్పంచ్ యాదుల్ తన సొంత ఖర్చులతో అంగన్ వాడీ కేంద్రానికి పాఠ్యసామాగ్రిని ఉచితంగా బుధవారం నాడు పంపిణీ చేయడం జరిగింది. ఈ అంగన్‌వాడీ పాఠశాలలోని విద్యార్థులకు, యూపి ఎస్ పాఠశాల విద్యార్థులు బాగ చదువుకోని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠ్యసామాగ్రిని జనవరి 26వ తేది గణతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని 24 పరీక్ష ప్యాడ్‌లు, 60 నోట్‌పుస్తకాలు, 60 పెన్నులు, 30 పెన్సిల్లు, 38 పలకలు, 5 బలపాల ప్యాకెట్లు, 4 దస్తర్లు, పాఠశాలకు బహుకరించారు.

## సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ శరత్**

**సంగారెడ్డి బ్యూరో, జనవరి 18, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ సముదాయం పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ శరత్ సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. బుధ వారం కలెక్టర్ శరత్ అదనపు కలెక్టర్ రాజర్షి షా తో కలిసి ఆకస్మికంగా సంగారెడ్డిలో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ సముదాయం పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్కెట్ సముదాయం పనులు పూర్తయితే పట్టణ ప్రజలకు అందుబాటులోకి వచ్చి ఒకే చోట అన్ని విక్రయాలు జరగడంతో ఇబ్బందులు తీరుతాయన్నారు. రాత్రింబవళ్లు పనుల పూర్తిపై దృష్టి సారించాలని సంబంధిత కాంట్రాక్టర్ కు సూచించా రు. పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. జాప్యానికి తావివ్వకుండా త్వరితగతిన సమీకృత మార్కెట్ సముదాయ నిర్మాణం పూర్తికావాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ రాజర్షి షా, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# అన్ని గ్రామ పంచాయతీల్లో వందశాతం పన్ను వసూళ్ళు కావాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్**

**సంగారెడ్డి బ్యూరో, జనవరి 18, ప్రభాతవార్త:** ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించిర లక్ష్యాల సాధనకు అధికారులు, చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ శరత్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి డిఎల్‌పిఒలు, ఎంపీవోలు, ఎంపీడీవోలు, ఏపీవోలు, పంచాయతి సెక్రటరీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పన్ను వసూళ్లు, ఈజీఎస్ లేబర్ మొబలైజేషన్, మొబైల్ యాప్ అటెండెన్స్, పౌర సేవల ఆన్లైన్, క్రీడా ప్రాంగణాలు, వైకుంఠ రథాలు, బాడీ ఫ్రీజర్లు, తడిచే పొడి చెత్త సేకరణ, సోషల్ ఆడిట్ పేరాల నివేదిక, నర్సరీలు, ప్లాంటేషన్ ప్రణాళిక తదితర అంశాలపై కలెక్టరన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీలలో వందశాతం పన్ను వసూలు పూర్తి కావాలని పంచాయతీ సెక్రెటరీలకు ఆదేశించారు. లో పెర్ఫార్మెన్స్ ఉన్న ఎంపీఓలకు, పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డిపిఒకు ఆదేశించారు. అదే విధంగా సంబంధిత డీఎల్పిఒలను సంజాయిషి కోరాలని సూచించారు. తడి, పొడి చెత్త సేకరణ, సెగ్రి గేషన్ జరగాలని, చెత్త అమ్మకంతో గ్రామపంచాయతీలకు ఆదాయం సమకూరాలని తెలిపారు. ప్రతి శుక్రవారం వాటరింగ్ డే విధిగా జరగాలని స్పష్టం చేశారు. వైకుంఠ ధామాలు, వైకుంఠరథాలు వినియోగంలోకి తీసుకురా వాలన్నారు. ప్రతి క్లస్టర్ లో వైకుంఠరథం, బాడీ ఫ్రీజర్ అందుబాటులో ఉంచాలని ఎంపీఓలు పంచాయతీ సెక్రెటరీలకు సూచించారు. ఈజీఎస్ లేబర్ మొబలైజేషన్ జరగాలని, లేబర్ పేమెంట్ ప్రాపర్‌గా జనరేట్ చేసి లేబర్ కు పే స్లిప్స్ ఇవ్వాలని సూచించారు. ఎఫ్‌టిఒలు ఎప్పటి కప్పుడు జనరేట్ చేయాలన్నారు. ఆక్టివ్ లేబర్లో 50 శాతం కన్నా తక్కువ లేబర్ మొబలైజేషన్ ఉన్నట్లయితే ఆయా పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉపాధిహామీలో చేపట్టనున్న పనులకు సంబంధించి అవసరమైన పనులను గుర్తించా లన్నారు. ఎంపీడీవోలు, ఎంపీఓలు పూర్తి కో-ఆర్డినేషన్ తో పనిచే యాలన్నారు. ఈజీఎస్ జాబా కార్డ్స్ కు ఆధార్ సీడింగ్ జరగాలని తెలిపారు. తెలంగాణ క్రీడా ప్రాంగణాలు అన్ని కాంపోనెంట్స్‌తో పూర్తి చేసి అందుబా టులోకి వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. కంటి వెలుగుకు సం బంధించి ఆయా గ్రామ కార్యదర్శి తమ గ్రామంలో నిర్వహించు క్యాంపు తేదీలను టామ్ టామ్ ద్వారా తెలియజేయాలని, ఇంటింటికి వెళ్లి కరపత్రం, ఆహ్వాన పత్రిక అందజేయాలన్నారు. ముందస్తు ప్రణాళిక చేసుకో వాలని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు కంటి పరీక్ష చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. అదే విధంగా క్యాంపుకు ప్రజలు టైం స్లాట్ మేరకు వచ్చేలా చూడటం, క్యాంపు వద్ద కావాల్సిన లాజిస్టిక్స్ ఏర్పాటు చేసే బాధ్యత పంచాయతీ సెక్రెటరీ, ఎంపీఓల దని తెలిపారు. క్యాంపు నిర్వహణ సజావుగా జరిగేలా పూర్తి బాధ్యతతో పనిచే యాలన్నారు. అదనపు కలెక్టర్ రాజర్షి షా, జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, డిఆర్ఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు,

# కంటి వెలుగు ప్రారంభోత్సవ ఏర్పాట్ల పరిశీలన

**సదాశివపేట, జనవరి 18, ప్రభాతవార్త:**

దృష్టి లోపాలను దూరం చేసేందుకు వీలుగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లలో నిమగ్నమైంది. బుధవారం సదాశివపేట మండలంలోని ఆత్మకూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శిబిరాన్ని ముఖ్యఅతిథులచే ప్రారంభించి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు విస్తృత స్థాయిలో చేపడుతున్న ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించుటకు జిల్లా కలెక్టర్ శరత్ ఆత్మకూర్‌లోని కేంద్రాన్ని పరిశీలించారు. ఏర్పాట్లలో ఎలాంటి లోపాలకు తావులేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవడంతో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కేంద్రంలో ఉండటంతో మండల స్థానిక వైద్యాధికారి ప్రవీణ్‌కు కితాబు ఇచ్చారు.కార్యక్రమాన్ని పగడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అవసరమైన వారికి నేత్ర పరీక్షలు నిర్వహించి మందులు, కంటి అద్దాలు అందించేలా ప్రణాళికబద్దంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోనేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని 18సంవత్సరాలకు పైబడి వయస్సు కలిగిన ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు నిర్వహించుకునేలా చూడాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ రాజర్షిషా, డిఎంహెచ్ఓ డాక్టర్ గాయత్రిదేవి, మండల వైద్యాధికారి ప్రవీణ్,మండల స్థాయి ఉన్నతాధికారులు, గ్రామ సర్పంచ్ గంగన్న తదితరులు పాల్గొన్నారు.

**రుక్మాపూర్‌లో..**

**న్యాల్‌కల్, జనవరి 18, ప్రభాతవార్త:** ఈ నెల 19వ తారీఖు నుంచి ప్రారంభం కానున్న రెండవ విడత కంటి వెలుగు శిబిరాల ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. మండల కేంద్రమైన న్యాల్‌కల్‌తో పాటు మండలంలోని రుక్మాపూర్, ముంగి గ్రామాల్లో గురువారం నుంచి శిబిరాలు ప్రారంభం కానున్నాయి. శిబిరాలను పురష్కరిం చుకుని మిర్జాపూర్(బి) ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బాధ్యులు రుక్మాపూర్‌లోన మాక్ డ్రిల్‌ను నిర్వహించారు. శిబిరాలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని డిఎల్‌పిఓ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ వెంకట్‌రెడ్డి, న్యాల్‌కల్ పిహెచ్‌సి డాక్టర్ ఏ శ్వేతప్రియ, మిర్జాపూర్(బి) పిహెచ్‌సి బాధ్యులు శామల, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**డప్పూర్‌లో..**

**మనూర్, జనవరి 18, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రారంభం కానున్న రెండవ విడత కంటి వెలుగు శిబిరాలను బుధవారం మండల అధికారులు పరిశీలించారు. మండలంలోని డప్పూర్ గ్రామంలో అధికారులు మాక్ డ్రిల్ నిర్వహించారు. శిబిరాలకు చేరుకున్న ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగు ఏర్పాట్లు చేసుకోవాలని ఎంపిడిఓ శార్జిలోద్దిన్, పిహెచ్‌సి డాక్టర్ రవికు మార్‌లు సూచించారు. గ్రామాల్లో నిర్వహించే కంటలి వెలుగు శిబిరాలను కంటి సమస్యలతో సతమతమవుతున్న వారు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

**కంది మండలంలో..**

**కంది, జనవరి 18, ప్రభాతవార్త:** ఈ నెల 19వ తారీఖు నుంచి ప్రారంభం కానున్న రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని కంటి సమస్యలతో సతమతమవుతున్న ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కంది పంచా యితీ కార్యదర్శి వినతి చేశారు. శిబిరానికి వచ్చే ప్రజలకు మండల కేంద్రమైన కందిలోని మైనార్టీ షాదీ ఖానా వద్ద కంటి వెలుగు శిబిరాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**సదాశివపేటలో..**

**సదాశివపేట, జనవరి 18, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించబోయే కంటి వెలుగు రెండవ విడత కార్యక్రమం ముఖ్యమంత్రి కేసిఆర్ ఖమ్మం జిల్లాలో అధికారికంగా బుధవారం ప్రారంభించారు. అనంతరం గురువారం నుండి అన్ని జిల్లాలలో మున్సిపాలిటీలలో, గ్రామ పంచా యతీలలో ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. అట్టి అదేశాల ప్రకారం సదాశివపేట పట్టణంలో ఉదయం 9గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా హాల్ నందు, హర్బన్ హెల్త్ సెంటర్( పాత ప్రభుత్వాస్పత్రి)లో రెండు ప్రాంతాలలో తెలంగాణ రాష్ట్ర హ్యాండ్లూమ్ డెవల ప్మెంట్ కార్పోరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ అధ్వర్యంలో ప్రారంభించడం జరుగుతుందని మున్సిపల్ కమీషనర్ తెలిపారు. కావున కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, వార్డుల ప్రజలు హజరుకావాని ఆయన కోరారు.



కంటి వెలుగు ఏర్పాట్లను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్



రుక్మాపూర్‌లో కంటి వెలుగు ఏర్పాట్లను పరిశీలిస్తున్న డిఎల్‌పిఒ, ఎంపిడిఓ, వైద్య సిబ్బంది



డప్పూర్‌లో కంటి వెలుగు ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

## సంగారెడ్డి జిల్లా నుంచి ఖమ్మం సభకు తరలి వెళ్లిన బిఆర్ఎస్ నాయకులు



ఖమ్మం సభకు వెళుతున్న బిఆర్ఎస్ నాయకులు

**సంగారెడ్డి మున్సిపాలిటి జనవరి 18,ప్రభాతవార్త:**

ఖమ్మంలో బుదవారం జరిగిన బిఆర్ఎస్ మొదటి ఆవిర్భావసభకు సంగారెడ్డి నియోజకర్గం నుండి పార్టీశ్రేణులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యాకర్తలు,అభిమానులు అధిక సంఖ్యలో ఖమ్మం తరలి వెళ్ళారు. ఈసందర్బంగా పార్టీజిల్లా అధ్యక్షులు,రాష్ట్రచేనేత అబివృద్ది సంస్థ చైర్మేన్ చింతా ప్రభాకర్ మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ సేవలు దేశం ప్రజలకు ఆవసరమని గ్రహించిన జాతీయ అధ్యక్షులు సి.ఎం.కెసిఆర్ జాతీయరాజకీయాలలోకి రావాలని నిర్ణయించారని అన్నారు.సంక్షేమ,అబివృద్ది కార్యాక్రమాలలో దేశంలోని ఇతర రాష్ట్రాలకు తెలంగాణరాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని చింతా ప్రభాకర్ అన్నారు.పదిహేను వందలమంది పార్టీకార్యాకర్తలు, నాయకులు పార్టీ బహిరంగా సభకు తరలి వెళుతున్నట్లు చింత ప్రభాకర్ అన్నారు.ఉమ్మడి మెదక్‌జిల్లా డిసిసిబి ఉపాధ్యాక్షులు పట్నం మానిఖ్యం మాట్లాడుతూ బిఆర్ఎస్ ఆవిర్భావ సభ దేశరాజకీయాలలో చిరస్థాయిలో నిలిచిపోయో ఘట్టమని అన్నారు.ఐదులక్షల మందితో చేపట్టిన భారీసభ దేశరాజకీయాలలో పెనుమార్పులు తీసుకురావడం ఖాయమని అన్నారు.

**సదాశివపేట నుంచి..**



ఖమ్మం బహిరంగ సభకు వెళ్ళేందుకు సిద్దమైన నాయకులు

**సదాశివపేట, జనవరి 18, ప్రభాతవార్త:**

సదాశివపేట మండలం నుండి ఖమ్మం బిఆర్ఎస్ బహిరంగ సభకు కార్లలో 56 మంది మండల పార్టీ అధ్వర్యంలో బయలుదేరారు. ఈ సందర్బంగా మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పెద్దగొల్ల ఆంజనేయులు మాట్లాడుతూ బిజెపి పార్టీ మోదీ ప్రభుత్వం పేద ప్రజలపై అన్ని నిత్యవసర వస్తువుల ధరలు పెంచి పేదలపై భారం మోపుతుందన్నారు. ఇట్టి కేంద్ర ప్రభుత్వం బాధలు తప్పాలన్న మన రాష్ట్ర ముఖ్యమంత్రి కేసిఆర్ జాతీయ రాజకీయాల్లో రావలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఖమ్మం వెళ్ళిన వారిలో సోసైటి చైర్మన్ రత్నాకర్‌రెడ్డి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు నవీన్, ఎంపిటిసిలు సునితా సుధాకర్, సంతోష్‌గౌడ్, సర్పంచులు ఏసయ్య, శ్రీహరి, సలావుద్దిన్, నరేష్‌గౌడ్, శేఖర్, కుమార్, కృష్ణ, లక్ష్మారెడ్డి, రాజు, నాయకులు సత్యం, సత్యనారాయణ, నాగేష్, రమేష్, చోటుమియా, రవి, సర్వేశ్వర్ తదితరులు ఉన్నారు.

## బలవంతపు భూసేకరణ ఆపాలి

**-టీజేఎస్ రైతు సంఘం డిమాండ్**



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, రైతుల దృశ్యం

**చౌటకూరు, జనవరి 18, ప్రభాతవార్త:** ఆర్ఆర్ఆర్‌లో భూములు కోల్పోతున్న రైతులకు ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా మూడింతలు అధనపు పరిహారం చెల్లించాలని తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షులు పాతదొడ్డి తుల్జారెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజులు డిమాండ్ చేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం గ్రామ సభలు నిర్వహించాలన్నారు. ఆర్ఆర్ఆర్‌కు అవసరమైన భూసేకరణను రైతుల వద్ద నుంచి బలవంతంగా సేకరించడాన్ని నిరసిస్తూ టీజేఎస్, రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ సభను బహిష్కరించారు. సభలో నుంచి లేని వచ్చిన నాయకులు,రైతులు సభ వెలుపల ఫంక్షన్ హాల్ గేట్ వద్ద రైతు సంఘం నిరసన వ్యక్తం చేయగా టీజేఎస్ జిల్లా అధ్యక్షులు తుల్జారెడ్డి ఆధ్వర్యంలో రైతులు 161 జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. వాణిజ్య పంటలు పండే సారవంతమైన భూములను బలవంతంగా పోలీసుల బందోబస్తు మధ్య ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడం పట్ల విచారం వ్యక్తం చేశారు. భూములు కోల్పోతున్న రైతులకు ప్రత్యామ్నాయంగా మరో చోట ప్రభుత్వ భూములు ఉంటే వాటని కేటాయించాలని, ఇంటికో ఉద్యోగం, శాశ్వత ఉపాధి అవకాశాలు కల్పించాలంటూ చింతపల్లి గ్రామానికి చెందిన గుండు అనంతయ్య సూ చించారు. ఆర్ఆర్ఆర్ ఏర్పాటుకు సంబంధించి క్షేత్ర స్థాయిలో పరిశీలనకు వచ్చే సిబ్బందిని అడ్డుకుని తీరుతామని చౌటకూరు మండల శివంపేట గ్రామానికి చెందిన కుమ్మరి రాంచందర్, అవుసలి ఆంజనేయులు పేర్కొన్నారు. న్యాయంగా మార్కెట్ ధరకు అనుగుణంగా ప్రభుత్వం పెద్ద మనసుతో పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వానికి సూచించారు.

## టెస్ట్ అవైలబుల్ స్కీంలో చేరుటకు పాఠశాలల నుండి దరఖాస్తుల ఆహ్వానం: కలెక్టర్

**సంగారెడ్డి బ్యూరో, జనవరి 18, ప్రభాతవార్త:**

షెడ్యూల్డ్ కులములకు చెందిన విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన ఇంగ్లీష్ మీడియం విద్యను అందించేందుకు బెస్ట్ అవేలబుల్ పథకం క్రింద ఆసక్తి గల పాఠశాలల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్ కులములు అభివృద్ధి శాఖ ఇంఛార్జ్ ఉపసంచాలకులు జగదీష్ బుధవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యాసంస్థలు, విద్యాబోధనలో ఉన్నత ప్రమాణాలు కలిగి ఉండాలన్నారు. గత ఐదు సంవత్సరములలో 10వ తరగతి ఫలితాలలో 90 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత పొంది ఉండాలని తెలిపారు. అందులో 50 శాతం మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించి ఉండాలని పేర్కొన్నారు. విద్యతో పాటు విద్యార్థి సమగ్ర అభివృద్ధికై సాంస్కృతిక కార్యక్రమాలు, ఆట, పాటల యందు తగు కలిగి ఉండాలని తెలిపారు. ఈ పథకం క్రింద దరఖాస్తు చేసుకొను వారు సీబీఎస్ సి/ఐ సి ఎస్‌సి/ ఎస్ఎస్‌సి బోర్డు గుర్తింపు పొంది ఉండాలని తెలిపారు. పాఠశాల యందు రెడిడెన్సియల్ సౌకర్యం ఉన్నట్లయితే వారికి రెడిడెన్సియల్ విద్యార్థులకు కేటాయించి ప్రతి విద్యార్థికి విద్యా బోధన, వసతి, భోజనం ఏర్పాటు నిమిత్తం, పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యునిఫారం మొదలగునవి సరఫరా చెయ్యవలసి ఉంటుందని తెలిపారు. ఆసక్తి పై అర్హతలు కలిగి ఉన్న ఇంగ్లీష్ మీడియం పాఠశాలల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు ఫారములు సంగారెడ్డి జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి కార్యాలయంలో లభిస్తాయని, పూర్తిచేసిన దరఖాస్తులను అదే కార్యాలయంలో అందజేయాలని సూచించారు. దరఖాస్తులను నమోదు చేసుకునేందుకు ఆఖరు తేది: 31-01-2023 తెలిపారు. ఇతర వివరములకు జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి కార్యాలయంలో నేరుగా, లేదా ఫోన్ నెంబర్: 8179 715513 లో సంప్రదించవచ్చని ఆయన సూచించారు.

## ఎన్‌టీఆర్ సేవలు చిరస్మరణీయం

**నారాయణఖేడ్, జనవరి 18 ప్రభాతవార్త:** ఉమ్మడి రాష్ట్ర స్వర్గీయ మాజీ ముఖ్య మంత్రి ఎన్టీ రామారావు రాష్ట్రానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఖేడ్ పట్టణానికి చెందిన అర్థం విశ్వనాథం అన్నారు. బుధవారం ఎస్.. వి.ఎస్. ఏజెన్సీ లో ఎన్టీరామారావు 27వ వర్థంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అరిపించా రు. అనంతరం రోగులకు పండ్లను పంపి ణీ చేసి వర్థంతి వేడుక కార్యక్ర మం నిర్వహించారు. డాక్టరు బాలాగౌడ్, మోహన్‌రెడ్డి, తేదేపా అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



వర్ధంతి వేడుకలు జరుపు కుంటున్న అభిమానులు

## ఘన సన్మానం

**సదాశివపేట, జనవరి 18, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ఆగమ సలహా మండలి సభ్యులు వీరశైవ పండితులు, వక్త,పౌరాణికులు, వేదపండితులు, జ్యోతిష, ఆగమ పండితులు, కవి, రచయిత డాక్టర్ మహంతయ్య స్వామి అసోసియేట్ ప్రొఫేసర్‌గా పదోన్నతి పొందిన శుభసందర్భంగా ఆయనకు అర్చకులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జంగం మహే ష్‌స్వామి మాట్లాడుతూ మునుముందు మరెన్నో ఉన్నతమై నటువంటి శిఖరాలు ఆధిరోహించాలని పార్వతి పరమేశ్వరులను కోరుకుంటున్నామన్నారు. జంగం సంతోష్‌స్వామి, నగేష్‌స్వామి, సిద్దుస్వామి, శివకాంత్‌స్వామి, కేదర్నాథ్‌స్వామిలు పాల్గొన్నారు.

## రేషన్‌బియ్యం కొనుగోలు దారుల రీఎంట్రీ .!

**హుస్నాబాద్,జనవరి18,ప్రభాతవార్త**

గత నాలుగుమాసాలుగా హుస్నాబాద్ సర్కిల్‌ఇన్స్పెక్టర్‌గా ఎర్రల కిరణ్ బాధ్యతలు చేపట్టిన అనంతరం భయంతో పద్దుమణిగిన రేషన్‌బియ్యం అక్రమరవాణా మళ్ళీ షురూ చేసినట్లు సమాచారం.సిఐ కిరణ్ బాధ్యతలు చేపట్టిన తరుణంలో రేషన్‌బియ్యం కొనుగోలు దారులను తీవ్రంగా హెచ్చరించి దాడులు జరిపి అరికట్టేందుకు తీసుకున్న చర్యల మూలంగా ఎవరూ రేషన్ బియ్యం కొనుగోలు చేయకుండా ఉన్న దరిమిలా చప్పపడిపోయిన బియ్యం కొనుగోలుదారులకు మళ్ళీ రెక్కలు వచ్చిన చందంగా ఊరిలో గ్రామాల్లో పడి ఇంటింటా బియ్యం కొనుగోలు చేస్తున్న దృశ్యాలు సహజంగానే గానే దర్శనమిస్తున్నాయి.ఇదిలా ఉండగా హుస్నాబాద్ పట్టణంలోని ఒక సామాజికవర్గానికి చెందిన కుటుంబం తాము బహిర్గతం కాకూడదనే సాకుతో ఆ కుటుంబీకులు తమ ఇంటిలోని మహిళలను పంపి బియ్యం కొనుగోలు చేయిస్తున్నట్లు పకా సమాచారం అందింది.ఇంతకాలం అన్నీ తానై చూసుకున్న వారి సామాజికవర్గానికి చెందిన ఓ పెద్దమనిషి ఇక నుండి తనకు ఎలాంటి ప్రమేయం ఉండదని చెప్పుకుంటూనే అంతర్గతంగా ప్రోత్సహం ఇస్తున్నట్లు వినికిడి.ఇదిలా ఉండగా ఇక్కడ కొనుగోలు చేసిన బియ్యంను ఇతర రాష్ట్రాలకు తరలించేందకు గాను పట్టణ శివారుల ప్రాంతాలను అలాగే ఉమ్మడి సమీప జిల్లాల ప్రాంతాల్లోనూ డెంలు ఏర్పాటు చేసుకుని తరలిస్తున్నట్లు సమాచారం.హుస్నాబాద్ సమీపంలోని గ్రామమైన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని బొమ్మనపల్లిలో ఈ రహస్యడెన్‌ను నిర్వహించి అక్కడి నుండి బియ్యంను ఇతర రాష్ట్రాలకు తరలించారని చెబుతున్నారు.గత నాలుగు మాసాలుగా హుస్నాబాద్ సిఐ కిరణ్ పేరును చెపుతూ సార్ తెలిస్తే ఊరుకోడని అంటూ రేషన్‌బియ్యం అబ్ధిఆరులనుండి కేవలం ఎనిమిది రూపాయలకు కొనుగోలు చేసి రవాణకు పాల్పడిన అక్రమార్కులు ఇపుడు పదిరూపాయలకు కొనుగోలు చేస్తూ బియ్యం రవాణకు పాల్పడు తున్నారు.ఈ అక్రమబియ్యం కొనుగోలు రవాణ విషయంపై పట్టణ పోలీస్ యంత్రాంగం దృష్టి కేంద్రీకరించి అరికట్టాల్సిన అవసరం ఎంతైన ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



రేషన్‌బియ్యం సరఫరా దృశ్యం